క్లుప్తంగా

ఇంకొల్లులో నేత్రదానం


దాత అంజమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇంకొల్లు గ్రామానికి చెందిన కడియాల అంజమ్మ(75) ఆదివారం మృతి చెందారు. కుమారులు రాజశేఖర్, కుమార్తెలు అంజనా దేవి, లక్ష్మిల అంగీకారం మేరకు దాత కార్నియాలను ఇంకొల్లు అవయవదాన కమిటీ సభ్యులు గుంటూరు శంకర కంటి వైద్యశాల వైద్యులచే సేకరించారు. ఇంకొల్లు అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ షేక్ రఫీ, చుండి సాంబశివరావులు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

14 మంది జూదరుల అరెస్టు

మేదరమెట్ల: జూదం ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామ శివారుల్లో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 14 మంది జూదరులను అరెస్టు చేసినట్లు, వారి వద్ద నుంచి రూ.18,070 నగదు, రెండు కోడి పుంజులను, ఎనిమిది కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మేదరమెట్ల, కొరిశపాడు ఎస్‌ఐలు రఫీ, సురేష్‌లు దాడిలో పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి అరటిపండ్ల పూజ


అరటి పండ్లపూజలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారికి అమావాస్య సందర్భంగా ఆదివారం దశసహస్ర కదళీఫలపూజ (పదివేల అరటిపండ్లతో) కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి అభిషేకం అనంతరం 11 ఆవృత్తాలుగా దేవస్థాన పండితులు, అర్చకులు పదివేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. దేవస్థాన ఏసీ ఎం. తిమ్మనాయుడు ఏర్పాటు పర్యవేక్షించారు.

ప్రారంభానికి సిద్ధం !


గతంలో నిలిచిపోయిన బార్ అసోసియేషన్ భవన నిర్మాణం


భవన నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్న మున్సిపల్ ఏఈ రవికుమార్, అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

- చీరాల బార్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులు
- మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం చొరవ

చీరాల రూరల్: గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన చీరాల బార్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. స్లాబు మట్టం వరకు పిల్లర్లు, గోడల నిర్మాణం జరిగినా కొన్ని అనివార్య కారణాల వలన అర్థంతరంగా నిలిచిపోయిన పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. మరో నాలుగు రోజులలో పనులు ప్రారంభం కానున్నాయి. గతంలో స్లాబు వరకు ఏర్పాటు చేసిన పిల్లర్లు, గోడల నిర్మాణాలను, వాటి నాణ్యతా ప్రమాణాలను మున్సిపల్ ఏఈ రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొరవ రమేష్‌బాబు, కోటిక ఉదయ భాస్కరరావు ఇతర న్యాయవాదులతో కలసి పరిశీలించారు.

వివరాల్లోకి వెళ్తే..

చీరాల కోర్టు భవన సముదాయాల వద్ద నూతన బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి పదేళ్ల క్రితం న్యాయవాదులు పూనుకున్నారు. గతంలో కంటే ప్రస్తుతం న్యాయవాదుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఇప్పుడు ఉన్న అసోసియేషన్ హాలు సమావేశాలకు సరిపోకపోవడం లేదు. సమావేశాలు జరిగే సమయంలో కొంతమంది న్యాయవాదులు లోపల ఉండడం మరికొంతమంది స్థలం సరిపోక హాలు బయట ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో న్యాయవాదులు నూతన భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా అప్పట్లో సీనియర్ న్యాయవాదులు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ. చలపతిరావు, పొగడదండ ఆదినారాయణ, బండారుపల్లి హేమంత్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఎంపీ నిధులతో పాటు న్యాయవాదులందరి సహాయ సహకారాలతో పనులు ప్రారంభించారు. వారి హయాంలోనే భవన నిర్మాణం స్లాబు మట్టానికి పిల్లర్లు, గోడలు ఏర్పాటు చేశారు. వారి కాల పరిమితి ముగియడంతో అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆకిశెట్టి పుల్లయ్య నాయుడు, కర్నేటి రవి, మాగంటి జ్ఞానేశ్వరరావులు కూడా కొంతమేర పనులు చేపట్టారు. ప్రస్తుత అధ్యక్షుడిగా కొనసాగుతున్న గొరవ రమేష్‌బాబు సారథ్యంలో పనులు వేగంగా జరిగేందుకు ప్రణాళికలు నిర్వహిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే బలరాం సహకారంతో..

స్లాబు దశకు వచ్చిన బార్ అసోసియేషన్ నిర్మాణ పనులు పదేళ్ల క్రితం నిధుల లేమితో పాటు కొన్ని అనివార్య కారణాల వలన ఎక్కడి పనులు అక్కడే అర్థాంతరంగా నిలిచిపోయాయి. అయితే ప్రస్తుతం అవరోధాలన్నీ తొలగిపోవడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమయ్యింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి చొరవతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. బార్ అసోసియేషన్ నిర్మాణ పనులకు సహకారమందించమని గతేడాది అధ్యక్షుడి హోదాలో ఉన్న గొరవ రమేష్‌బాబు, దివంగత సెక్రటరి కటకం చంద్రశేఖర్‌లు అనేక దఫాలుగా న్యాయవాదులతో కలసి వినతి పత్రాలు అందించి విన్నవించారు. దీంతో స్పందించిన బలరామ కృష్ణమూర్తి కోర్టు భవన సముదాయాల వద్ద నిలిచిపోయిన బార్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులను రెండు మూడు పర్యాయాలు స్వయంగా పరిశీలించారు. ఆయన మాటిచ్చిన ప్రకారం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంపీ సహకారంతో ఎంపీ నిధులు రూ. 20 లక్షలు మంజూరు చేయించారు.

న్యాయవాదుల సహకారంతో పూర్తి చేస్తాం..



నిలిచిపోయిన బార్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులను న్యాయవాదులందరి సహకారంతో త్వరలోనే పూర్తి చేస్తాం. నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తితో పాటు టెక్నికల్ అనుమతులు మంజూరుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు.

– గొరవ రమేష్‌బాబు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు.

క్రిస్మస్ క్యారెల్స్ ప్రారంభం


క్యారెల్స్ వేడుకలను ప్రారంభిస్తున్న ఉద్యోగులు సంఘ సభ్యులు

చినగంజాం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చినగంజాం అంబేడ్కర్ నగర్ క్రిస్మస్ క్యారెల్స్ వేడుకలను ఆదివారం ప్రారంభించారు. క్యారెల్స్ నిర్వాహకులు మేకల మేషక్ బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన గ్రామ పెద్దలు, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉద్యోగుల సంఘం సభ్యులు మేడికొండ ప్రేమ్ కుమార్, ప్రభుకుమార్, ధనుంజయ్‌లు కేక్‌ను కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేక్‌ను క్యారెల్స్‌లో పాల్గొనే చిన్నారులకు పంచి పెట్టారు. కిస్మస్ తాత వేషధారణలో కార్యక్రమానికి వచ్చిన యువకులు పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చప్పిడి అభిలాష్, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

మార్టూరు హెల్ప్ టీమ్‌కు అవార్డులు


జిల్లా అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న దుర్గ, సల్మా

మార్టూరు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన నియంత్రణకై కృషి చేస్తున్న మార్టూరుకు చెందిన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవార్డులు లభించాయి. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా బాపట్లలో జిల్లా ప్రముఖుల చేతుల మీదుగా షీల్డుతోపాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన నియంత్రణ 2017 చట్టం పై గత మూడు నెలలుగా మీకు తెలుసా? అవగాహనా కార్యక్రమం నిర్వహించడం, ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సంస్థ ప్రతినిధులు కే. దుర్గ, షేక్ సల్మాలను జిల్లా అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ జయమ్మ, బాపట్ల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వాణిల చేతుల మీదుగా వీరిద్దరూ ప్రశంస పత్రాలు షీల్డు అందుకున్నారు. వీరిని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సాగర్, మార్టూరు ప్రతినిధులు రమ్య, సరోజిని, రూతు తదితరులు అభినందించారు.

పోలీసుల విస్తృత గాలింపు చర్యలు


రాత్రి గస్తీలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై


బస్టాండ్‌లో వ్యక్తి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

అద్దంకి రూరల్: ఇటీవల పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. శాంతి, భద్రతల విషయంలో విఫలమైన పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. అద్దంకి పట్టణంలో వరస దొంగనాలతో తీవ్ర భయాందోళన చెందుతున్న ప్రజలకు ధైర్యాన్ని కల్పించేందుకు అద్దంకి సీఐ పీ. కృష్ణయ్య ఆధ్వర్యంలో దొంగలను పట్టుకొవటానికి విస్తృత గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా గత రెండు వారాల నుంచి సీఐ సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో పట్టణంలోని నాలుగు వైపుల గస్తీని ముమ్మరం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బస్టాండ్‌లో, రోడ్ల మీద ప్రతి వీధి తిరుగుతూ అనుమానాస్పదంగా కనబడిన వాహనాలను తనిఖీ చేస్తూ, వక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. సరైన సమాచారం చెప్పలేని వారి స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ తనిఖీలో భాగంగా ఇటీవల కలవకూరు రోడ్డులో ట్రాక్టర్‌ల నుంచి ఆయిల్ దొంగిలిస్తున్న దొంగలను, వైఎస్సార్ సీపీ నాయకుడి షాపులో పడిన దొంగలకు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. త్వరలో పట్టణంలో చోరీలు చేసిన దొంగలను పట్టుకుంటామన్నారు.

పుస్తకాలు చదివితే మరింత విజ్ఞానం


లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ బాదం విజయభాస్కర రెడ్డి అన్నారు. ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే దేశభక్తులు, చరిత్ర, సైన్స్, కథల పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వనసమారాధనలతో సత్సంబంధాలు


కారంచేడు హరేరామ ఆశ్రమంలో మారేడు దళంతో శివయ్యకు ప్రత్యేక పూజలు


చెన్నుపల్లిలో అలంకరణలో పరుసవేదిశ్వరుడు


శివాలయంలో నిర్వహించిన లక్ష బిల్వార్చన


చీరాల: సభలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రంగాచార్యులు


కారంచేడు పెద బజారు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


చినగంజాంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో పాల్గొన్న దంపతులు

చీరాల అర్బన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షీరపురి వైఖానస సంఘం చీరాల డివిజన్ (చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు) ఆధ్వర్యంలో ఆదివారం పేరాలలోని తేలప్రోలు వీరయ్య, వెంకాయమ్మ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా దీపోత్సవం, విష్ణు సహస్రనామ పారాయణ, కార్తీక దామోదర పూజ నిర్వహించారు. కార్తీక మాస విశిష్టత గురించి పరాశరం వేదమూర్తి, దీవి అంజనీకుమార్‌లు వివరించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ వైఖానస సంఘం చీరాల డివిజన్ ఏర్పడిన తర్వాత ప్రతి సంవత్సరం విఖనస మహర్షి జయంతి, కార్తీక వనసమారాధనలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు సంఘీయులందరూ పాల్గొన్నప్పుడే సంఘం బలంగా ఉంటుందన్నారు. అందరూ ఐక్యతతో ఉండి సంఘ బలోపేతానికి కృషి చేయాలని వక్తలు సూచించారు. ఇటీవల చీరాల వైకుంఠపురంకు చెందిన లక్ష్మీ హయగ్రీవస్వామి ఉపాసకులు పర్చూరి తిరుమలాచార్యులు మరణించగా ఆయనకు సంఘీయులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పదోతరగతి, ఇంటర్, డిగ్రీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, రిటైర్డు ఉపాధ్యాయులు పరాశరం మధుసూదన చక్రవర్తి దంపతులకు సంఘ అధ్యక్షులు రావులకొల్లు పరాంకుశం వెంకటరంగాచార్యులు కుటుంబ సభ్యులు గౌరవ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు నారాయణం సత్యబాబు, రత్నాకరం మంగనాథాచార్యులు, సంఘ కార్యదర్శి నారాయణం శ్రీనివాసాచార్యులు, అద్దేపల్లి సత్యప్రసాద్, వినుకొండ ఫణీంద్ర, వేదాంతం కిరణ్, చీరాల డివిజన్ వైఖానస సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్తీకమాస చివరి రోజు ప్రత్యేక పూజలు..

కారంచేడు: కార్తీకమాసం ముగిసే చివరి రోజున ఆదివారం, అమావాస్య కలసి రావడంతో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వాతి, విశాఖ, అనూరాధ నక్షత్రాలు అమావాస్యతో కలసి వచ్చినప్పుడు పిత్రుదేవతలు సంతోషిస్తారని పండితులు చెప్పారు. మండల కేంద్రమైన కారంచేడు పెద బజారు శివాలయంలో అర్చక స్వామి కారంచేటి వీరాంజనేయ శర్మ భక్తులకు పండుగ ప్రాముఖ్యతలను తెలిపి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం..

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాం గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కమిటీ, ఆలయ సేవాదళ్ ఆధ్వర్యంలో పురోహితులు సోమ సుందర శాస్త్రి పూజా నిర్వాహణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జీ పిచ్చయ్య వ్యాఖ్యాతగా వ్యవరించగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గెల్లి రామచంద్రరావు, వలివేటి అప్పారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీకమాస వేడుకలు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతి పాత్రమైన కార్తీకమాసం వేడుకలు ఆదివారంతో ముగిశాయి నెల రోజులుగా శివనామ సంకీర్తన, అభిషేకాలు, రాత్రులు భజనలతో హోరెత్తించారు. ఆదివారం చెన్నుపల్లి గ్రామంలోని గంగాపార్వతి సమేత పరుసవేదిశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పీ.సుబ్రమణ్యశర్మచే శివునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఉత్స విగ్రహాలకు పూజలు ఆలయ కమిటీ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మందికి అన్నసంతర్పణ చేపట్టారు. కొణిదెన, నక్కబొక్కలపాడు, అంబడిపూడి, ముక్తేశ్వరం, శివాలయాల్లో కూడా ముగింపు వేడుకలను గనంగా నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన..

చీరాల అర్బన్: కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం స్థానిక పేరాలలోని శివాలయంలో స్వామి వారికి లక్ష బిల్వపత్రాలతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసం చివరిరోజు అమావాస్య కావడంతో స్వామివారికి విశేష అర్చనలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష బిల్వ పత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలానే కార్తీక మాసం అమావాస్య సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వీరరాఘవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

గోశాలకు ఆర్థిక సాయం

చీరాల రూరల్: ఎస్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యుడు మురహరిశెట్టి శివ అచ్యుతరావు ఆదివారం స్థానిక హైస్కూలు క్రీడా మైదానంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోశాలలోని గోవుల ఆహారం నిమిత్తం, రూ. 2,000, కోటయ్య అనాథశ్రమంలోని వృద్ధుల కోసం నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, వీరాంజనేయులు సభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, జ్యేష్ఠ నక్షత్రం, పాడ్యమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.